

## డీఆర్‌సీ బాధ్యతాయుతంగా వ్యవహరించాలి

సిటీబ్యూరో, మే 8(నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల్లో పనిచేసే డీఆర్‌సీ బృందాలు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్ అన్నారు. బుధవారం కొమ్రం భీమ్ ఆదివాసీ భవన్‌లో డీఆర్‌సీ బృందాల అధికారులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల అధికారులు నిర్వర్తించాల్సిన విధులు, బాధ్యతలు, పరిశీలించాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. డీఆర్‌సీల్లో ఎలాంటి సమస్యలు లేకుండా పంపిణీ, సేకరణ సాఫీగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రిసైడింగ్ అధికారులకు అందించాల్సిన పోలింగ్ మెటీరియల్ బ్యాగ్‌ను చెక్ లిస్టుతో సహా ముందుగానే సిద్ధం చేసుకోవాలని సూచించారు. అధికారుల సూచనలు పాటిస్తూ డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్ల సిబ్బందికి కౌంటర్లపై అవగాహన కల్పించారు. ఈవీఎంలు, పోల్ మెటీరియల్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి, ఎన్నికల తర్వాత పోలింగ్ సెంటర్ల నుంచి రిసెప్షన్ కేంద్రాల్లోకి తీసుకురావడానికి అవసరమైన మ్యాన్ పవర్ ఏర్పాటు చేయాలని ఏఆర్‌ఓలకు సూచించారు. పోలింగ్ సిబ్బందికి రుచికరమైన, నాణ్యమైన ఆహారాన్ని అందించాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు అనుదీప్ దురిశెట్టి, హేమంత్ కేశవ్ పాటిల్ ఎన్నికలను సజావుగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. సెగ్మెంట్ల వారీగా ఈవీఎం, స్ట్రాంగ్ రూం, డీఆర్‌సీల్లో మౌలిక వసతులు, పోలింగ్ సిబ్బందికి భోజన సరఫరా గురించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సీఈవో మధుకర్ నాయక్, జిల్లా ఎన్నికల శిక్షణా తరగతుల నోడల్ అధికారి సునంద, జోనల్ కమిషనర్ హేమంత్ బోర్కడే, డీఆర్‌ఓ వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

## కరెంట్ షాక్‌తో యువకుడి మృతి

కొండాపూర్, మే 8 : కరెంట్ షాక్‌తో యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన చందానగర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. బీహార్‌కు చెందిన ధర్మేంద్ర కుమార్ యాదవ్ (33) బతుకుదెరువు కోసం నగరానికి వలసొచ్చి, చందానగర్‌లోని జేపీ సినిమాస్ సమీపంలో ఉన్న టీ స్టాల్‌లో పనిచేస్తున్నాడు. కాగా, మంగళవారం సాయంత్రం కురిసిన భారీ వర్షంతో టీ స్టాల్‌ను త్వరగా మూసివేస్తున్న సమయంలో పక్కనే ఉన్న జేపీ సినిమాస్ ఎలక్ట్రికల్ బోర్డుకు చైన్‌తో స్టాల్‌కు తాళం వేసేందుకు లాగాడు. ఒక్కసారికి కరెంట్ షాక్‌కు గురై పడిపోయాడు. వెంటనే సమీపంలోని దవాఖానకు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ధర్మేంద్ర సోదరుడు అజిత్ కుమార్ యాదవ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## రూ. 22.50 కోట్ల నగదు పట్టివేత

సిటీబ్యూరో, మే 8 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో గ్రేటర్ పరిధిలో నిర్వహిస్తున్న తనిఖీల్లో భారీ మొత్తం నగదు పట్టుబడుతూనే ఉన్నది. ఇప్పటి వరకు ఎన్నికల అధికారులు రూ. 22,50,97312 నగదు, రూ. 17.93 కోట్ల విలువజేసే వస్తువులు, రూ. 26,832 లీటర్ల మద్యం పట్టుకుని సీజ్ చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్ తెలిపారు. అక్రమ మద్యం అరికట్టడంలో భాగంగా 297 మందిపై కేసులు నమోదు చేసి, 294 మందిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. తాజాగా, గడిచిన 24 గంటల వ్యవధిలో రూ. 28.43 లక్షల నగదు, రూ. 5.55 లక్షల విలువజేసే వస్తువులు, 33.50 లీటర్ల మద్యం పట్టుకోగా, రెండు కేసుల్లో ఒకరిని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఇక ఎన్నికలకు సంబంధించి 14 ఫిర్యాదులు రాగా, వాటిని పరిశీలించి పరిష్కారం చేసినట్లు తెలిపారు. ఆరుగురిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటి వరకు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల ద్వారా రూ. 5.91 కోట్ల నగదు, రూ. 3.57 కోట్ల విలువజేసే ఇతర వస్తువులు, పోలీసు, ఐటీ శాఖ ద్వారా రూ. 16.29 కోట్ల నగదు, రూ. 13.59 కోట్ల విలువజేసే వస్తువులను సీజ్ చేసినట్లు తెలిపారు. ఎస్ఎస్‌టీ బృందాలు రూ. 29.94 లక్షల నగదు, రూ. 77లక్షల విలువైన వస్తువులను సీజ్ చేశారని పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఎన్నికలకు సంబంధించిన 632 ఫిర్యాదులు రాగా, వాటన్నింటినీ పరిష్కారం చేసి, 406 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు తెలిపారు. ఎన్నికల ఉల్లంఘనలకు సంబంధించిన 46 ఫిర్యాదులపై చర్యలు తీసుకున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్ ప్రకటనలో పేర్కొన్నారు.

### ఆస్మాన్‌ఘడ్‌లో రూ.12.56 లక్షల నగదు పట్టివేత

మలక్‌పేట, మే 8: ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా, ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.12,56,635 నగదును మలక్‌పేట పోలీసులు స్వాధీనం చేసుకొని, ఎన్నికల సంఘం అధికారులకు అప్పగించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం సాయంత్రం మలక్‌పేట పోలీసులు సైదాబాద్ డివిజన్ ఆస్మాన్‌ఘడ్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాల సమీపంలో ఎస్ఐ జయంత్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. రెండు వేర్వేరు వాహనాల్లో తరలిస్తున్న రూ.12,56,635 నగదును పట్టుకున్నారు. ఆ నగదుకు సంబంధించి సరైన ఆధారాలను (పత్రాలను) చూపించకపోవడంతో పోలీసులు సీజ్ చేశారు. సీజ్ చేసిన నగదును ఎన్నికల అధికారులకు అప్పగించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

## ప్రయాణికుడి మెడలో నుంచి..

బంజారాహిల్స్, మే 8: బస్సులో ప్రయాణిస్తున్న ఓ యువకుడి మెడలో ఉన్న బంగారు గొలుసును తస్కరించేందుకు నలుగురు యువకులు ప్రయత్నించారు. బాధితుడు ప్రతిఘటించడంతో దుండగుల పథకం ఫలించలేదు. ఈ ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కర్నూల్ జిల్లాకు చెందిన ఎన్.హనుమంత రావు బుధవారం ఉదయం మెహిదీపట్నంలో ఆర్టీసీ బస్సు ఎక్కి బంజారాహిల్స్‌లోని కేర్ ఆస్పత్రి స్టాప్ వద్ద దిగేందుకు ప్రయత్నించాడు. బస్సు దిగుతున్న అతడిని ఇద్దరు ఆగంతకులు అడ్డుకున్నారు. మరో ఇద్దరు కలిసి అతడి మెడలో ఉన్న గొలుసును లాగారు. దీంతో అప్రమత్తమైన హనుమంతరావు గొలుసును పట్టుకోవడంతో తెగిపోయింది. అయినా, గొలుసు బాధితుడి చేతిలోనే ఉంది. దీంతో ఆ నలుగురు దుండగులు బస్సులోకి వెళ్లిపోయారు. బస్సులో నుంచి కిందకు దిగిన బాధితుడు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# క్రికెట్ బెట్టింగ్ ముఠా అరెస్టు

### నాలుగు సెల్‌ఫోన్లు, రూ.1.80 లక్షలు స్వాధీనం

ఎల్బీనగర్, మే 8: క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ముఠాను చైతన్యపురి లా అండ్ ఆర్డర్, వనస్థలిపురం ఎస్ఓటీ పోలీసులు కలిసి పట్టుకున్నారు. నిందితుల వద్ద నుంచి రూ. 1.80 లక్షల నగదు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. కొందరు యువకులు రెండు వెబ్ సైట్ల ద్వారా మంగళవారం రాత్రి జరిగిన రాజస్థాన్ రాయల్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌పై బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్లు వచ్చిన విశ్వసనీయ సమాచారంతో చైతన్యపురి పరిధిలోని వాసవీ కాలనీలో ఓ ఇంటిపై దాడిచేసి ఒక సబ్ బుకీ, ఒక పంటర్, ఇద్దరు మనీ కలెక్షన్ ఏజెంట్లను పట్టుకున్నారు. ఎల్బీనగర్ శాలివాహననగర్‌కు చెందిన సబ్ బుకీ రమేశ్ చంద్ చౌదరీ ( 30), వాసవీకాలనీకి చెందిన పంటర్ ఈడుకల్ల జగదీశ్ (45), ఎల్బీనగర్ ఎస్‌బీఐ కాలనీకి చెందిన మనీ కలెక్షన్ బాయ్ పల్లపు పవన్‌కుమార్ (23), శాతవాహన నగర్‌కు చెందిన మనీ కలెక్షన్ ఏజెంట్ సురేశ్ చౌదరీ ( 36), ఎల్బీనగర్‌కు చెందిన బుకీ ఎండీ ఆసీం, బైరామల్‌గూడకు చెందిన బుకీ సాయి ప్రసాద్, నాగోల్‌కు చెందిన శివనారాయణతో కలిసి ఒక ముఠాగా ఏర్పడ్డారు. రెండు వెబ్ సైట్ల సహాయంతో క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. ఈ మేరకు పోలీసులకు అందిన సమాచారంతో రమేశ్ చంద్ చౌదరీ, జగదీశ్, పవన్‌కుమార్, సురేశ్ చౌదరీని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ. 1.80 లక్షల నగదు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు వివిధ బ్యాంకుల్లో ఉన్న మరో రూ.12.50 లక్షల నగదును ఫ్రీజ్ చేశారు. ఈ కేసులో నిందితులైన ఆసీం, సాయిప్రసాద్, శివనారాయణ ఇంకా దొరకలేదని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

## శిథిలావస్థ గృహాలను గుర్తించాలి: కమిషనర్ రోనాల్డ్ రాస్

సిటీబ్యూరో, మే 8 (నమస్తే తెలంగాణ): వర్షాల కారణంగా నగరంలో ఎలాంటి ప్రమాదం జరగకుండా ఉండేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ అధికారులను ఆదేశించారు. సర్కిళ్ల వారీగా శిథిలావస్థలో ఉన్న నిర్మాణాలను గుర్తించాలని, వాటి విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న సెల్లార్లను గుర్తించి, ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నగరంలో శిథిలావస్థలో ఉన్న గృహాలను సర్వే చేసి నివేదిక ఇవ్వాలని టౌన్ ప్లానింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. బుధవారం టౌన్ ప్లానింగ్ సీసీపీతో కలిసి సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులతో మాన్‌సూన్‌పై టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. శిథిలావస్థకు చేరిన నిర్మాణాలు, ప్రహరీలు, సెల్లార్ల తవ్వకాలతో ప్రమాదాలకు అవకాశం ఉన్నదని, తగిన జాగ్రత్తలు తీసుకునేలా నిర్మాణదారులకు సూచించాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే సర్కిళ్ల అధికారులే బాధ్యులవుతారన్నారు. 18లోగా శిథిలావస్థకు చేరిన నిర్మాణాల పట్ల పూర్తి నివేదిక ఇవ్వాలన్నారు. గత ఏడాది గుర్తించి, తీసుకున్న చర్యలు, ఈ సంవత్సరం ముందస్తు చర్యలపై పూర్తి నివేదిక అందజేయాలని కమిషనర్ రోనాల్డ్ రాస్ ఆదేశించారు.

## 11 నుంచి రంగారెడ్డి జిల్లాలో మద్యం దుకాణాలు బంద్

సిటీబ్యూరో, మే 8 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 11వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి 13వ తేదీ సాయంత్రం పోలింగ్ ముగిసే వరకు, ఓట్ల లెక్కింపు సందర్భంగా జూన్ 4వ తేదీ ఉదయం 6 గంటల నుంచి లెక్కింపు పూర్తయ్యే వరకు రంగారెడ్డి జిల్లా పరిధిలోని మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లు, కల్లు కంపౌండ్‌లను మూసివేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కె.శశాంక బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా మద్యం విక్రయాలకు పాల్పడినా, రవాణా చేసినా ఎన్నికల నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.




## జోస్ ఆలుక్కాస్‌లో అక్షయ తృతీయ ఆఫర్లు

జూబ్లీహిల్స్, మే 8: జోస్ ఆలుక్కాస్‌లో అక్షయ తృతీయ ఆఫర్లు ప్రారంభమయ్యాయి. ఈ సంబురాలలో భాగంగా వినియోగదారుల కోసం అత్యుత్తమ ఆఫర్లు అందిస్తున్నామని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా అడ్వాన్స్ బుకింగ్ చేసుకున్న కస్టమర్లకు ఉచితంగా బంగారు నాణేలు పొందే అవకాశం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. క్రెడిట్ కార్డుతో చేసే కొనుగోళ్లపై రూ.5 వేల క్యాష్‌బ్యాక్ ఆఫర్‌ను అందిస్తున్నట్లు తెలిపారు. అక్షయ తృతీయలో శుభాలు చేకూరే మంచి ఘడియలలో వినియోగదారుల కోసం మరింత మంచి ఆఫర్లు అందిస్తున్నామని, మీరు ఇష్టపడే వారిని సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తేందుకు జోస్ ఆలుక్కాస్‌లో గిఫ్ట్ కార్డులు అందుబాటులో ఉన్నాయని చైర్మన్ జోస్ ఆలుక్కా తెలిపారు. ఇందులో భాగంగా వజ్రాల ఆభరణాలపై 20 శాతం తగ్గింపు, ప్లాటినం ఆభరణలపై 7 శాతం తగ్గింపును అందిస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు తమ పాత బంగారాన్ని సరికొత్త హెచ్‌యూఐడీ హాల్‌మార్క్ కలిగిన బంగారు ఆభరణాలతో మార్చుకోవడానికి, దానికి అనుబంధంగా ఉన్న ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ప్రాణం తీసిన సెల్ఫీ.. బీటెక్ విద్యార్థి మృతి

ఘట్‌కేసర్, మే 8: నీటి దగ్గర సెల్ఫీ ఫొటో దిగాలన్న కోరికతో బీటెక్ విద్యార్థి ప్రాణాలు తీసుకున్నాడు. ఈ ఘటన పోచారం పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్నోజిగూడలో మంగళవారం సాయంత్రం జరిగింది. పోచారం ఇన్‌స్పెక్టర్ రాజు కథనం ప్రకారం.. ఘట్‌కేసర్ మండలంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో యశ్వంత్ బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. మరో ముగ్గురు స్నేహితులతో కలిసి నీటి గుంత వద్ద సెల్ఫీ ఫొటో దిగాలన్న కోరికతో అన్నోజిగూడలోని క్రషర్ నీటి గుంత వద్దకు వెళ్లారు. ఫొటోలు దిగుతుండగా ప్రమాదవశాత్తు యశ్వంత్ కాలు జారీ నీటిలో పడిపోయాడు. స్నేహితులు కాపాడేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో పోచారం పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందంతో గాలింపు చేపట్టారు. బుధవారం సాయంత్రం యశ్వంత్ మృతదేహం లభించింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## మరో రెండు రోజులు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

జూబ్లీహిల్స్, మే 8: లోక్‌సభ ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా చేపడుతున్న తొలి విడత పోలింగ్ ప్రక్రియను మరో రెండు రోజుల పాటు పొడిగించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న అధికారులు, సిబ్బందితో పాటు భారత ఎన్నికల సంఘం గుర్తించిన అత్యవసర సర్వీసు విభాగాలకు ఏర్పాటు చేసిన ఈ పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను ఈనెల 3 నుంచి 8 వరకు చేపట్టారు. కాగా, వందశాతం ఓటింగ్ నమోదు చేసేందుకు మరో రెండు రోజులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ తెలిపారు. ఇందులో భాగంగా ఫారం 12, ఫారం '12 ఏ' ద్వారా దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులు వారికి ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో నేడు, రేపు ఓటు వేయాలని సూచించారు.

# మధురానగర్‌లో ఇంట్లోకి చొరబడి హత్య

### సాఫ్ట్‌వేర్ ఫ్యాకల్టీని హత్య చేసిన ఆగంతకుడు
### ఘటనాస్థలిలో కారం, పసుపు చల్లిన నిందితుడు
### పోలీసు జాగిలాలకు ఆనవాళ్లు చిక్కకుండా చర్యలు
### సీసీటీవీలో రికార్డయిన నిందితుడి దృశ్యాలు

వెంగళరావునగర్, మే 8 : పట్టపగలు దారుణం చోటు చేసుకుంది. అపార్ట్‌మెంట్‌లోని ఓ ఫ్లాట్‌లోకి చొరబడ్డ ఆగంతకుడు సుత్తెతో ఓ సాఫ్ట్‌వేర్ ఫ్యాకల్టీని దారుణంగా హత్య చేశాడు. ఈ దారుణం మధురానగర్‌లో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కృష్ణా జిల్లాకు చెందిన రవికుమార్ (40), అశ్విని దంపతులు. ఈ దంపతులకు ఎనిమిదేళ్ల కుమార్తె ఉంది. సాఫ్ట్‌వేర్ ఫ్యాకల్టీగా పనిచేసే రవికుమార్ ఇంజినీర్స్ కాలనీ, ఫ్రిబ్జి రెసిడెన్సీలోని రెండో అంతస్తులో తమ కుటుంబంతో కలిసి ఉంటున్నారు. అశ్విని, తన కుమార్తెతో కలిసి బుధవారం సాయంత్రం నాలుగున్నర గంటల సమయంలో వాకింగ్‌కు వెళ్లారు. రవికుమార్ ఒక్కరే ఇంటిలో ఉన్నారు. ఇదే అదునుగా భావించిన ఆగంతకుడు ఫ్లాట్‌లో ప్రవేశించాడు. రవికుమార్ తలపై సుత్తెతో దాడి చేశాడు. ఈ దాడిలో రవికుమార్ తల పగిలి, తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. వాకింగ్ పూర్తి చేసుకొని ఇంటికి వచ్చిన భార్య అశ్విని రక్తపు మడుగులో విగతజీవిగా పడి ఉన్న భర్తను చూసి నిర్ఘాంతపోయింది. రవికుమార్ మృతదేహంపై పడి భార్య, కుమార్తె రోదిస్తున్న తీరు అందరిని కంటతడిపెట్టించింది. హత్య జరిగిన సమాచారం అందుకున్న పంజాగుట్ట ఏసీపీ మోహన్‌కుమార్, మధురానగర్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలను సేకరించారు.

### ఘటనా స్థలంలో కారం, పసుపు చల్లిన దుండగుడు

రవికుమార్‌ను దారుణంగా హత్య చేసిన దుండగుడు.. ఘటనా స్థలంలో ఆనవాళ్లు లభించకూడదన్న ఉద్దేశంతో కారం, పసుపును చల్లాడు. విషయం తెలిసిన వెంటనే పోలీసు జాగిలాలు వచ్చాయి. పోలీసులు ఆధారాలు సేకరిస్తున్నారు.

హత్య చేసేందుకు వచ్చిన ఆగంతకుడు బ్యాగుతో ఉన్న దృశ్యం సీసీటీవీలో రికార్డయ్యాయి. ఆ బ్యాగులోనే సుత్తె దాచుకుని తెచ్చి ఉంటాడని, హత్య చేశాక.. ఆ సుత్తెను బ్యాగులో పెట్టుకుని తీసుకెళ్లి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీసు జాగిలాలు వాసనతో పసిగట్టకుండా ఉండాలని కారం, పసుపు చల్లి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.

### ఎవరా హంతకుడు..? కారణాలేంటి..?

ఎవరా హంతకుడు.! హత్యకు గల కారణాలేంటి..! అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. రవికుమార్‌కు ఎవరితోనైనా శత్రుత్వం ఉందా.! పగ, ప్రతీకారాలతో హత్యకు పాల్పడ్డాడా.! ఎందుకు హత్య చేసి ఉంటారనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. హత్యకు ముందు రెక్కీ చేసి ఉంటాడా.. భార్యా, కుమార్తె బయటకు వెళ్లిన కొద్ది సేపటికే ఫ్లాట్‌లోకి వచ్చి హత్య చేయడాన్ని బట్టి చూస్తే.. రెక్కీ నిర్వహించినట్టు తెలుస్తోంది. దోపిడీ కోసం వచ్చిన ఆగంతకుడిని ప్రతిఘటించబోయి ప్రాణాలు కోల్పోయాడా.! మరేవైనా ఇతర కారణాలు ఉన్నాయా..! పోలీసులు ఆరా తీస్తున్నారు. నిందితుడిని పట్టుకుంటాం.. అతడిని విచారిస్తే అన్ని విషయాలు తెలుస్తాయని పంజాగుట్ట ఏసీపీ మోహన్‌కుమార్ తెలిపారు.

# మద్యం మత్తులో డ్రైవింగ్.. ఒకరి మృతి

### మరో ముగ్గురికి గాయాలు

సైదాబాద్, మే 8 : స్నేహితుడి బర్త్‌డే వేడుకల్లో మద్యం సేవించిన మత్తులో వేగంగా కారు నడపడంతో జరిగిన -ప్రమాదంలో ఓ యువకుడు మరణించాడు. మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదం కాంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ శేఖర్ రెడ్డి కథనం ప్రకారం.. జిల్లెలగూడ కమలానగర్‌కు చెందిన అడుదోడ్ల పవన్ రెడ్డి (21) విద్యార్థి. మంగళవారం రాత్రి జిల్లెలగూడలోని ఓ స్కూల్ గ్రౌండ్‌లో జరిగిన మిత్రుడు కల్యాణ్ బర్త్‌డే వేడుకలకు వెళ్లాడు. వేడుకల్లో పవన్ రెడ్డి స్నేహితులు సాయికుమార్, వంశీ, ముఖేశ్ కలిశారు. అందరూ కలిసి మద్యం తాగి.. వేడుకలను బుధవారం తెల్లవారుజాము నాలుగు గంటల వరకు జరుపుకొన్నారు. అనంతరం ఐఎస్ సదన్‌లో నాస్టా పాయింట్‌లో టిఫిన్ చేయడానికి కారులో బయలుదేరారు. మద్యంలో మత్తులోనే వంశీ కారు నడుపుతుండగా.. ముఖేశ్ ముందు సీటులో, సాయికుమార్, పవన్ రెడ్డి, కల్యాణ్ వెనుక సీటులో కూర్చున్నారు.

కాంచన్‌బాగ్ సాయిబాబా ఆలయం సమీపంలోకి రాగానే వంశీ అతివేగంగా కారును డ్రైవింగ్ చేసి, ఆలయం కాంపౌండ్ గోడకు ఢీకొట్టడంతో వాహనం బోల్తా పడింది. దీంతో ఘటనా స్థలంలోనే పవన్ రెడ్డి మృతి చెందగా, ముఖేశ్, కల్యాణ్, వంశీలకు గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం స్థానిక దవాఖానకు తరలించారు. పవన్‌రెడ్డిని కూడా స్థానికంగా దవాఖానకు తరలించగా పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్టు చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతుడి సోదరుడు తరుణ్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని ఎస్సై లింగరాజు దర్యాప్తు చేస్తున్నారు.

# కాటేసిన కరెంటు తీగలు

పెద్దఅంబర్‌పేట, మే 8: కరెంటు తీగలు.. రెండు కుటుంబాల్లో చీకట్లు నింపాయి. ఈదురుగాలులతో కూడిన ఒక్క వర్షానికే తెగిన విద్యుత్ తీగలు వేర్వేరు చోట్ల రెండు ప్రాణాలను బలిగొన్నాయి. పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పరిధిలో తెగిన విద్యుత్ తీగ తగిలి ఓ ఐదేండ్ల బాలుడు మృతిచెందగా, అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలో ఓ పంక్చర్ షాపుపై కరెంటు తీగలు పడి నిర్వాహకుడు ప్రాణాలు వదిలాడు. పోలీసుల కథనం ప్రకారం అబ్దుల్లాపూర్‌మెట్‌లోని బీసీ కాలనీకి చెందిన మహ్మద్ పర్వీజ్ (36) జాతీయ రహదారికి ఆనుకుని హనుమాన్ టెంపుల్ సమీపంలో పంక్చర్ షాపు నడుపుతున్నాడు. మంగళవారం రాత్రి భారీ వర్షం కురుస్తున్నది. ఎప్పటిలాగే దుకాణం మూస్తుండగా.. విద్యుత్ తీగలు రేకుల షాప్‌పై పడ్డాయి. పర్వీజ్‌కు షాక్ తగిలి పడిపోయాడు. ఆ పక్కనే ఉన్న అతడి బావమరిది వెంటనే పర్వీజ్‌ను అంబులెన్సులో వనస్థలిపురంలోని ఏరియా దవాఖానకు తరలించగా.. అప్పటికే పర్వీజ్ మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య మహ్మద్ షబానా ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రమేశ్‌నాయక్ తెలిపారు.

### సెలవులని నాన్నతో వెళ్లి.. కరెంటు తీగకు బలి

ఈదురుగాలులకు కరెంటు తీగ తెగిందని ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోకపోవడంతో ఓ ఐదేండ్ల చిన్నారికి నూరేళ్లు నిండాయి. హయత్‌నగర్ పోలీసుల కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండల కేంద్రానికి చెందిన అలకుంట జమ్ములయ్య 15 ఏండ్లుగా హయత్‌నగర్‌లోని ముదిరాజ్ కాలనీలో ఉంటున్నాడు. చెత్త సేకరిస్తూ కుటుంబంతో కలిసి జీవిస్తున్నాడు. రోజూ భార్యతో కలిసి ఆటోలో చెత్త సేకరించేందుకు వెళ్లేవాడు. బుధవారం ఉదయం ఎప్పటిలాగే భార్యతో కలిసి ఇంట్లో నుంచి బయలుదేరాడు. సెలవులు కావడంతో వారి ముగ్గురు పిల్లలు కూడా జమ్ములయ్య వెంట వచ్చారు. అంతా కలిసి కుంట్లూరు సన్‌రైస్ కాలనీలోని రోడ్ నంబర్ 3కు వెళ్లారు. జమ్ములయ్య ఆటో నడుపుతుండగా.. భార్య చెత్త సేకరిస్తున్నది. ఎల్‌కేజీ చదువుతున్న ఐదేండ్ల కొడుకు శివ శంకర్ మూత్రం పోసేందుకు ఆటో దిగాడు. కొంచెం దూరంలోని ఖాళీ ప్రదేశంలో మూత్రం పోస్తుండగా.. అప్పటికే అక్కడ తెగిపడిన కరెంటు తీగ కాలికి తగిలి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. పెద్దఅంబర్‌పేట విద్యుత్ శాఖ నిర్లక్ష్యం కారణంగానే తన కొడుకు ప్రాణాలు వదిలాడని, వారిపై చర్యలు తీసుకోవాలని శివ తండ్రి జమ్ములయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు హయత్‌నగర్ పోలీసులు తెలిపారు. మంగళవారం రాత్రి భారీ వర్షంతో కూడిన ఈదురుగాలులు వీచాయి. ఈ సమయంలో తీగ తెగిపడిందని, ఈ విషయంపై విద్యుత్ సిబ్బందికి ఫిర్యాదు చేసినా.. ఉదయం వరకు పట్టించుకోకపోవడంతోనే ఓ ప్రాణం గాల్లో కలిసిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



## ప్రధాని మోదీని కలిసిన డా. రఘురామ్

సిటీబ్యూరో, మే 8 (నమస్తే తెలంగాణ): కిమ్స్- ఉషాలక్ష్మి రొమ్ము క్యాన్సర్ ఫౌండేషన్ వ్యవస్థాపక సంచాలకులు డాక్టర్ పి.రఘురామ్ మంగళవారం రాజ్‌భవన్‌లో ప్రధాని నరేంద్ర మోదీని కలిశారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్స్‌కు ఆయుష్మాన్ భారత్ వర్తింపచేస్తూ ప్రధాని తీసుకున్న నిర్ణయానికి డా.రఘురామ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా దేశంలో రొమ్ము క్యాన్సర్ కేర్, క్యాన్సర్ కేర్‌ను మరింత మెరుగుపరిచే అంశాలపై డా.రఘురామ్ ప్రధానితో చర్చించారు. అనంతరం 'పింక్ కనెక్షన్' ఎడిటోరియల్ పేజీలో ప్రధాని తన ఆటోగ్రాఫ్ ఇచ్చారు.



మాజీ గవర్నర్ తమిళి సై సౌందర రాజన్‌పై బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ లీగల్ సెల్ ప్రతినిధులు

## మాజీ గవర్నర్ తమిళిసై పై ఫిర్యాదు

బంజారాహిల్స్, మే 8: సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డికి మద్దతుగా బంజారాహిల్స్ రోడ్ నం. 12లోని ఎమ్మెల్యే కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించిన మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఓటర్లకు రామమందిరం నమూనాలు పంపిణీ చేశారంటూ బీఆర్ఎస్ లీగల్ సెల్ విభాగం ప్రతినిధులు బంజారాహిల్స్ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. కాలనీలో మంగళవారం పర్యటించిన తమిళిసై ఓటర్లకు రామమందిరం నమూనాలు పంపిణీ చేస్తున్నట్లు ఓ దినపత్రికలో వచ్చిన కథనం ఆధారంగా తాము ఎన్నికల సంఘానికి సైతం ఫిర్యాదు చేసినట్లు బీఆర్ఎస్ లీగల్ సెల్ సభ్యులు ఎన్. లలితా రెడ్డి, పి. ప్రవీణ్‌కుమార్, జక్కుల లక్ష్మణ్, కె. సదానందం పేర్కొన్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన తమిళిసై సౌందర రాజన్‌పై కేసు నమోదు చేయాలని బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్రకు వారు ఫిర్యాదును అందజేశారు. ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు విచారణ చేపట్టారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

SERVICES

★Passport Slots @ 5 Days, Birth Day Certificate Correction & Death Certificate, Aadhar Card, Labour Licence Marriage Certificate. 9849408579, 9985559119 NT-327614

GOLD FINANCE

★మీ బంగారం బ్యాంకుల్లోగానీ, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా, మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. Ph: 9100329739. NT-328121

PACKERS & MOVERS



★Sri Sai Packers & Movers Local and all over India, Resonable Price. Head Office Nacharam: 27176927, Ameerpet: 9866379391, DSNR: 9666993927, KKP: 9949513929, MP: 9848263927, ECIL: 9666983927. NT-328125

BUSINESS OFFER

★ఫ్రాంచైసీ తీసుకోండి లేదా ఒకసారి పెట్టుబడి పెట్టి ప్రతిరోజు లాభాలు పొందవచ్చు అగ్రిమెంట్ కలదు ఆఫీస్ అడ్రస్ నాగోల్ ఎక్స్ రోడ్: 9381721590 NT-339503

OLD AGE HOME



★వృద్ధులు & భార్యాభర్తలు A/C & N/C అటాచ్డ్ బాత్‌రూమ్, మేడిపల్లి/ ఉప్పల్, వృద్ధులు, బెడ్ పేషెంట్లు, ECIL, చీర్యాల్ 'X' రోడ్, భోజన వసతి మరియు 24/7 మెడికల్ సర్వీస్. ఫోన్: 7981467036, 9391039990, 9515474083. NT-311886

TOURS & TRAVELS



★మహదేవ టూర్స్: 26/5 చార్‌ధాం, 11/6 నేపాల్ ముక్తినాథ్, 7/7 నవాదేవి అమరనాథ్, 10/7 వైష్ణవి అమరనాథ్ @ 9908844377 NT-311998

LAND FOR SALE

★శ్రీశైలం హైవేలో 12 ఎకరాలు DTCP లేఅవుట్ LP No. వచ్చింది మార్కెటింగ్‌కు ఇవ్వబడును. అడ్వాన్స్ రూ||లు కంపల్సరీ ఉంటుంది. 9177619716. NT-328341

★సాగర్ హైవే ఫేసింగ్ వెంచర్‌కు అనుకూలమైన జోన్‌లో 2 ఎకరాలు మరియు 4 ఎకరాలు & 11.5 ఎకరాలు కలవు. సంప్ర: 9701253555. NT-339504

PLOT FOR SALE

★కే|| 9 లక్షలకే DTCP అప్రూవ్డ్ ప్లాట్లు నియర్ వంగపల్లి/బీబీనగర్ & ఘట్‌కేసర్ HMDA ప్లాట్లు కలవు. మీ పిల్లల భవిష్యత్తుకై ఇప్పుడే కాల్ చేయండి. 9666703666. NT-202

COMMERCIAL FOR SALE

★Commercial 1st Floor Abids 3528 Sft. Attached Men/Women Rest rooms. Most Suitable for BPO. Chance Deal. Rs.5,299/ Sft. clr Title. no dedicated parking. 9948350002 NT-328338

HOUSE FOR SALE



★New Maruthi Nagar, Dr. A.S. Rao Nagar, ECIL, House for Sale in 323 sq. yds, East Face, 25' Feet Road, @ 2 Cr. Ph: 9959151595 NT-328136

WANTED




★రియల్ ఎస్టేట్ సంస్థ కొరకు సొంత కారు ఉండి, మా కంపెనీలో మార్కెటింగ్ చేయుటకు అనుభవము కల్గిన వారికి ఇదే మా ఆహ్వానం. సంప్రదించండి: 7981217883 NT-339501

★ప్రముఖ 2 వీలర్ ఫైనాన్స్ సంస్థ పద్మపూజిత ఫైనాన్స్ & వీల్స్ మార్ట్‌లో పనిచేయుటకు ఇంటర్/ ITI/ డిప్లొమా/ డిగ్రీ చదువుకున్న యువకులకు ఉద్యోగాలు, జీతం: (14 వేలు-17,500/-) పెర్ఫామెన్స్, ఇన్సెంటివ్స్, నాన్ లోకల్స్ కోసం వసతి, బోనస్, మెడికల్ ఇన్సూరెన్స్ కలదు, సేల్స్ బ్రాంచ్ మేనేజర్-(M), సేల్స్ ఎగ్జిక్యూటివ్స్-(M), సేల్స్ కౌంటర్ క్యాషియర్-(M), కలెక్షన్ లైన్ ఎగ్జిక్యూటివ్స్-(M), వయస్సు 20-35 సం||లు, నియామక స్థానాలు: నాగోలు, LB నగర్, వనస్థలిపురం, కూకట్‌పల్లి, సూర్యాపేట, పద్మపూజిత ఆటో ఫైనాన్స్ మొదటి అంతస్తు, శ్రీ అమర లింగేశ్వర టవర్స్, యాక్సిస్ బ్యాంక్ పైన, LB నగర్, హైదరాబాద్ @ 9505237237, 8977939475. NT-327705

★Required Qualified & Experienced Lady Teachers for SAV HIGH SCHOOL (EM) Anantha Saraswathi Nagar East Anand Bagh. Contact: 9985645292, 9701264412. NT-327615

★ACCOUNTANTS/ Assistants, Graduates/ CA Articles with Exp in Tally, GST, Income Tax. M/F Salary 10-25k. Murthy & Sastry Narayanaguda Metro Pillar B-1176, Hyd. telikepalli2001@rediffmail.com. Ph: 9396549089 NT-327805

★డ్రైవర్ అవసరం! హైదరాబాద్‌లో ఎవరెస్ట్ ఫ్లీట్ CNG కార్ డ్రైవ్ చేయండి మరియు నెలకు Rs. 25,000* సంపాదించండి !! +91 9324912075 కి కాల్ చేయండి NT-016

అర్జెంటుగా కావలెను

★RTC లో పనిచేయుటకు ITI Motor, Diesel Machanics, Electricians and సెక్యూరిటీ గార్డ్స్ కావలెను (వసతి సౌకర్యం కలదు) Ph: 040-66366664, 9246663777, 9392663777. NT-311994

CHANGE OF NAME

★I, K. Uma Bharathi Alias Kandula Uma Bharathi, D/o. K.N. Sainath, W/o. Tagore Bala, R/o.H.No.12-10-410/8, Beedala Basti, Seethaphal Mandi, Sec'bad, Hyd-61, Telangana have Changed my Name as BHARATI BALA. NT-328342

CHANGE OF NAME

★I, Cheruvupalli Sudhakar Rao or Cheruvupalli Suedhakar Rao S/o. Cheruvupalli Vittal Sharma, R/o. Flat No. 108, Sai Jyothi Residency Adarsh Nagar Colony, Road No.1, Serilingampally Hyderabad have changed my name to Cheruvupally Sudhakar Rao. NT-34544

★I, Arun Nampally S/o. Suresh Nampally R/o. 26-108/20/1, BN 280, Balram Nagar, Safilguda, Hyderabad, Malkajgiri, K.V.Rangareddy, Telangana-500047 have Changed my Name to NAMPALLY ARUN VARMA. NT-339505

★I, Shaik Reeta, D/o. S. Murthy Tajuddin & S. Karuna, R/o. Kavadiguda, Sec'bad-80, have changed my name as Reeta Cheeli , D/o. Karuna Cheeli & Murthy Cheeli for all future purpose. NT-327819

★I, BHAARGAVI SREYA JHA, D/o. GAYANAND JHA, R/o H.No.15-31-S2-B/Flat No. 1407, Manjeera Trinity Homes, KPHB, Phase-3, Dharmareddy Colony, Kukatpally, Medchal-Malkajgiri-500072, Telangana, have changed my name as AYRA JHA NT-327618

★I, D.P.M.B SYAMALA alias DASARI PMB SYAMALA alias S P V SAILAJA, W/o S. RAVI KUMAR, D/o D K SATYANARAYANA, R/o P.No.1133, 304, Lakshmi Royal, Mayuri Nagar, Miyapur, Hyderabad-500049, Telangana, shall hereafter be known as S P V SAILAJA. NT-327619

★I, S. Manoharamma (Old Name) W/o. Nagula Sridhar R/o. H.No. 14-81/130/1, Raghavendra Colony, Beerumguda, Sangareddy, TS-502032. I have changed my name to Nagula Manohara (New Name) for all purpose. NT-34537

LOST

★I, MITTAPALLY SATHYANARAYANA, S/o. RAJAMALLAIAH MITTAPALLY, Plot No. 203, Mythri Classic Apartment, Chitraa Layout, Chintalkunta, L.B. Nagar, Ranga Reddy District, Lost My original Sale Deed document bearing Doct No:11158/2016, while travelling from Green Hills Colony to Chaitanyapuri. If Anyone Found Please Contact:9703894315 NT-339506

★I, Pattisapu Venkata Aravind, R/o. 43048, Janapriya Utopia, Hyderabad-500047 have lost my UK Biometric Residence Permit RV5059878. If found contact-7674040111. NT-34544

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడ మైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...

4 లైన్లకు రూ.400/- (5% GST అదనం) ప్రతి అదనపు లైనుకు రూ.75/-

Cell: 9848077857

చిక్కడపల్లి, సికింద్రాబాద్ : 9182777202
మల్కాజిగిరి, E.C.I.L : 9182777125
అమీర్‌పేట్, మెహిదీపట్నం : 9182777126
ఉప్పల్, తార్నాక : 9182777806
L.B.నగర్, వనస్థలిపురం : 9182777209
దిల్‌సుఖ్‌నగర్ : 9182777805
B.N.రెడ్డి నగర్, సంతోష్‌నగర్ : 9182777204
కూకట్‌పల్లి, బాలానగర్ : 9182777205